మినీకథ

# తథాస్తు

కె.బి.కృష్ణ



బన్నీ దుబాయ్‌నుండి వచ్చాడు. బన్నీ తల్లి అతని వళ్ళంతా నిమురుతూ "చిట్టి కన్నా రెండేళ్ళనించి ఏం తిన్నావో అసలు తిన్నావో లేదో,ఇవ్వాళ నీకు ఇష్టమైన వన్నీ చేసి దగ్గరుండి తినిపిస్తా అంది. "అమ్మా నేను తింటానులే నువ్వు నాకు ఇష్టమైనవి చెయ్యి చాలు'' అన్నాడు. ఎందుకంటే తల్లి తనకి నిజంగానే తినిపిస్తుంది నోట్లో ముద్దలు కుక్కేసి.

పప్పు, గుత్తివంకాయకూర, కొబ్బరి మామిడి కాయపచ్చడి, సాంబార్, పరవాన్నం, గులాబ్‌జామూన్స్, పులిహోర, ఇలాగ ఎన్నో రకాలు బల్లమీద వున్నాయి. "అమ్మా ఇవన్నీ తింటే నాకు ఏదైనా ప్రోబ్లమ్ వస్తే ఇండియాలో వుండిపోవాల్సి వస్తుందేమో. కొంచం నీ ప్రేమను కంట్రోల్ చేసుకోవే. అన్నాడు బన్నీ నవ్వుతూ. "పిచ్చోడా అలా అనకూడదు. అశుభం మాట్లాడకు తథాస్తు దేవతలు వుంటారు. నువ్వు అక్కడ కేబుల్ టీవీ చూస్తున్నావో లేదో. టీవీలో మనం మధ్యాహ్నం భోజనం చేసేటప్పుడు అద్భుతమైన డైలీ సీరియల్ వస్తుంది. పెడతాను. అది చూస్తూ కడుపునిండా తిను అంది తల్లి.

టి.వీఆన్ అయింది. సీరియల్ సమర్పించే వారి ప్రకటనలు మొదలయ్యాయి.

ఒక తను ఒక చేతిలో సీసాతోనూ, మరోచేతిలో లెట్రిన్స్ శుభ్రం చేసే బ్రష్‌తోనూ ప్రత్యక్షమయ్యాడు. అతను ఒక గృహిణిని 'మీ లెట్రిన్ దేనితో శుభ్రం చేస్తున్నారు. అని

అడిగాడు ఆమె ఏదో చెప్పింది. అతను వెంటనే "పదండి మా లిక్విడ్ తో మీ లెట్రిన్ శుభ్రం చేసి చూపిస్తాను" అంటూ పరమ ఛండాలంగా ఉన్న వాళ్ళ లెట్రిన్‌ని శుభ్రం చేసేశాడు. బన్నీకి కడుపులో తిప్పుతోంది. తింటున్న పప్పు, గుత్తివంకాయకూర అన్నంపైకి వచ్చేస్తోంది. ఆముదం తాగిన ముఖం పెట్టి "అమ్మా ఛానల్ మార్చవే అన్నాడు. "అది కాదురా బన్నీ ఈ ప్రకటనల తర్వాతే మంచి సీరియల్ వస్తుంది" అంది.

మళ్ళీ స్క్రీన్ మీద ఒక రెండు క్రిములు లేచి నిలబడి నవ్వుతూ'' మా తడాఖా చూపిస్తాం. మమ్మల్ని చంపాలనుకుంటున్నారా. మీ లెట్రిన్‌లో మేము చేరి, మీ అందరికీ విరోచనాలు వాంతులూ కలిగేట్లు చేసిమమ్మల్ని మా లెట్రిన్ లోనే వుంచేస్తాం

హ॥హ॥ అంటూ లెట్రిన్ బేస్‌మీద నిలబడి విరగబడి నవ్వుతున్నాయి 'బన్నీకి కడుపులో తిప్పుతోంది "అమ్మా ప్లీజ్ ఛానల్ మార్చవే అన్నాడు బాధతో 'బన్నీ వోర్చుకో నాన్నా, మంచి సీరియల్ ఈ వారంలోనేతనను వేధిస్తున్న కోడల్ని అత్తగారు ఇంట్లోంచి తరిమేస్తోంది"అంది తల్లి.

మళ్ళీ తెరమీద ఇద్దరు యువకులు,ఇద్దరు పసిపిల్లలకు కడుగుతున్నారు చిరాకుగా, మీకు ఈ చిరాకులు లేకుండా వుండాలంటే "బుడ్డీస్" వాడండి.అంటూంది ఒక అమ్మాయి.

ఇంతలో బన్నీ హోక్ హోక్' అనుకుంటూ వాష్‌బేసిన్ దగ్గరకు పరుగులతో వెళ్ళి అప్పటి వరకు తిన్నదంతా వాంతి చేసేసుకున్నాడు.

నా తండ్రీ నీకు ఏమైందిరా?' అంది తల్లి ఆందోళనతో "ముందు ఆటీవీ కట్టేయవే నీకు పుణ్యం వుంటుంది. నేను వున్నన్నాళ్ళూ టి.వీ పెట్టొద్దమ్మా దయచేసి అంటూ వాష్ బేసిన్ దగ్గరే వుండిపోయాడు బన్నీ. ★




